ఘనంగా ముందస్తు సంక్రాంతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో భోగి మంటలు వేశారు. విద్యార్థులకు రంగవల్లులు పోటీలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. విజేతలకు జేకే స్టీల్ నిర్వాహకులు బొల్లినేని జగన్నాథం నాయుడు సౌజన్యంతో ఎస్ఎంసీ చైర్మన్ శంకర్, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, కమిటీ సభ్యులు శైలజ బహుమతులు అందజేశారు. అలాగే పట్టణంలోని ద స్కూల్, ఎంజీఎం స్కూల్లో కూడా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ప్రధానోపాధ్యాయులు మునిరత్నంనాయుడు, విశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో బుధవారం ఘనంగా ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయదుస్తులతో అలరించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇళ్లముందు ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టడం వల్ల కలిగే ఆరోగ్యపరమైన విషయాలను, భోగి పండుగ విశిష్టతను సిస్టర్ శిర్లీ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విక్రమ్ నెక్స్ట్ జనరేషన్ పాఠశాలలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని విక్రమ్ నెక్స్ట్ జనరేషన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ఆ స్కూలు విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ జి.చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి, ప్రిన్సిపల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏర్పేడు : ఆమందూరు పాఠశాలలో భోగిమంటల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, వరదయ్యపాళెం హైస్కూల్ ప్రాంగణంలో..


ఏర్పేడు : సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమందూరు పాఠశాలలో..

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు ప్రాథమిక పాఠశాలలో బుధవారం మందుస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో వివిధ రకాల రంగవల్లులు తీర్చిదిద్దారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు భోగిమంటల వేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు, వరదయ్యపాళెం హైస్కూళ్లలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి మంటలు వేశారు. పల్లెటూరి సంప్రదాయ పాటలకు నృత్యాలు చేశారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను ప్రధానోపాధ్యాయులు మోహన్‌బాబు, విమలకుమారి, ఇతర ఉపాధ్యాయులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, బందిల కుమార్, వెంకటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం శ్రీసాయి గణేష్ విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భోగి మంటలు వేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ అధినేత జువ్వల ధనంజయరెడ్డి, ఉప్పరపల్లి చెంచురెడ్డి, కుమార్‌రాజ పాల్గొన్నారు. అలాగే రేణిగుంట నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు హరిదాసు, నారదుడు, డూడూ బసవన్న వేషధారణలో అలరించారు. పాఠశాల వ్యవస్థాపక చైర్మన్ భాస్కర్‌రెడ్డి, స్కూల్ సిబ్బంది, విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

వికాస్ విద్యాసంస్థలో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక వికాస్ విద్యాసంస్థలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ పల్లమాల సుధాకర్, సీఈఓ మునిప్రతాప్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు ఎంఈఓ రవీంద్రనాథ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే శ్రీనివాస తేజ పాఠశాలలో కరస్పాండెంట్ కండ్రాతి సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు భోగిమంటలు వేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేశారు. సంప్రదాయ దుస్తులతో హాజరై విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ హేమమాలిని, ఉపాధ్యాయులు పరంధామన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: మండలంలోని ఆదర్శ పాఠశాల, కేవీబీపురం జెడ్పీ హైస్కూలు, రాగిగుంట, రాయపేడు తదితర గ్రామ పాఠశాలల్లో భోగి మంటలు వేశారు. సంక్రాంతి పిండి వంట లు తయారు చేసి సంబరాలు నిర్వహించారు. ఆదర్శ, రాగిగుంట పాఠశాలల్లో తెలుగుదనం ఉట్టిపడేలా ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.


శ్రీకాళహస్తి : ఎంజీఎం పాఠశాలలో..


రేణిగుంట : నాగార్జున స్కూల్‌లో..


వరదయ్యపాళెం: కోలాటమాడిన విద్యార్థినులు


పిచ్చాటూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..


సెయింట్ జేవియర్స్ స్కూలులో..


బుచ్చినాయుడుకండ్రిగ : వికాస్ స్కూల్‌లో..



శ్రీకాళహస్తి :విక్రమ్ నెక్స్ట్ జనరేషన్ స్కూల్‌లో..., వరదయ్యపాళెం : పాండూరు హైస్కూల్లో..



రేణిగుంట : గాజులమండ్యం శ్రీ సాయి గణేష్ విద్యాలయంలో.., శ్రీకాళహస్తి : ది స్కూల్‌లో..

క్లుప్తంగా

నేడు కాంబాకంలో గడప గడపకు..

వరదయ్యపాళెం: మండలంలోని కాంబాకం గ్రామ పంచాయతీలో గురువారం ఉదయం 9గంటల నుంచి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు.

భక్తిప్రపత్తులతో 'సంకటహర చతుర్థి'


హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: సంకటహర చతుర్థి పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలోని కన్యమూల గణపతి సన్నిధి వద్ద బుధవారం భక్తిప్రపత్తులతో పూజార్చన కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వినాయకస్వామికి విశేష అభిషేకాలు, పూజల అనంతరం హోమపూజలు చేశారు. భక్తులు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం


మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: పుట్టిన బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని, తల్లులు తప్పనిసరిగా బిడ్డలకు పాలు తాగించాలని వైద్యాధికారి దివాకర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బాలింతలు, గర్భవతులు, పిల్లల ఆరోగ్యం, తల్లిపాల విశిష్టతపై అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను పట్టించాలన్నారు. దీనివల్ల శిశువులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు బుధవారం తన కార్యాలయంలో ఎస్టీయూ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఎస్టీయూ నాయకులు హరికృష్ణ, గుమ్మడి మురళి, సుధాకర్, దేవేంద్ర, స్టాలిన్, జయప్రకాష్, కృష్ణయ్య, శ్రీహరి, రవి, చంద్రయ్య, నాగూర్, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



ఏర్పేడు: వన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి సీఆర్ రాజన్ జన్మదినం పురస్కరించుకుని బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పేదలకు అన్నదానం చేశారు. వన్నెకుల క్షత్రియులు, అభిమానులు మధ్య సీఆర్‌రాజన్ కేక్ కట్ చేశారు. అన్నదానం అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియుల సంఘం నాయకులు దశరథరామిరెడ్డి, సత్రవాడ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మేళంగారి సుబ్రమణ్యంరెడ్డి, సురేష్ బాబు, జనార్ధన్‌రెడ్డి, గోపి రాయల్, వెంకటస్వామి, లోకనాథరెడ్డి, మునిచంద్రారెడ్డి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

సత్యవేడు: మండలంలోని చిన్న ఈటిపాకం గిరిజకాలనీలో బుధవారం ఓ పూరిల్లు దగ్ధమైంది. వివరాలు.. కె.పోలయ్య అనే వ్యక్తి ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. పనులను దగ్గరుండి చూసుకునేందుకు పక్కనే పూరిల్లు వేసుకుని నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం కూలీలను పిలిచేందుకు పోలయ్య తన భార్యతో కలిసి ఊళ్లోకి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి పూరిల్లు కాలిపోయింది. అగ్నిప్రమాదంలో ఇంట్లోని ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్ , వంట పాత్రలు, దుస్తులు, బీరువాలో దాచుకున్న రూ.40వేలు, ఇంటి పట్టా, ఇతర ధ్రువీకరణ పత్రాలు బూడిదయ్యాయి. మూడు సవర్ల బంగారు గొలుసు కరిగి ముద్దగా మారింది. మొత్తం రూ.3లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. అగ్నిమాపక, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. సర్పంచ్ గోవిందస్వామి మాట్లాడుతూ కట్టుబట్టలతో రోడ్డున పడిన గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పేదల అభ్యున్నతికి చేయూతనివ్వాలి


చీరలు పంపిణీ చేస్తున్న సుబ్రమణ్యం, చంద్ర

ఏర్పేడు: పేదల అభ్యున్నతికి దాతలు చేయూతనివ్వాలని ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తంబా సుబ్రమణ్యం, ఎస్ఎస్ చంద్ర విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని మర్రిమంద వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, దుప్పట్లు, పంచెలు, టవళ్లు పంపిణీ చేశారు. అలాగే వారికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, తమవంతుగా పేదలను ఆదుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, వైఎస్సార్ సీపీ నాయకుడు కరుణాకరన్, ఈఓపీఆర్డీ బాలసుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారిణి


వాణీమోహన్‌కు ముక్కంటి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఏపీ టూరిజం, ఆర్కియాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.వాణీమోహన్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు మల్లికార్జునప్రసాద్, సతీష్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం


మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని జ్ఞానమ్మకండ్రిగకు చెందిన ఎం. జనార్ధన్ బుధవారం అనారోగ్యంతో మరణించాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు కరకంబాడి విద్యార్థినులు


హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో టీచర్లు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు అండర్–15 విభాగంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తీగల ఆనంద్ తెలిపారు. తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో కరకంబాడి హైస్కూలు 9వ తరగతి విద్యార్థినులు జాహ్నవి, నందిని, పర్ణిక ఎంపికయ్యారు. వారిని బుధవారం స్కూలులో అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయుడు రెడ్డెయ్య, ఉపాధ్యాయులు భాగ్యశేఖర్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, సుబ్రమణ్యం, రాధాకృష్ణ, జహంగీర్, రవీంద్ర, మురళి, గోపి, హేమావతి పాల్గొన్నారు.

దోమలు, లార్వాలను నిర్మూలిద్దాం


దోమల నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పొయ్యి, దళితవాడ గ్రామాల్లో దోమలు, లార్వాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై ఇంటింటికీ వెళ్లి హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే'గా నిర్వహించాలని కోరారు. గ్రామస్తులకు దోమల లార్వాలను చూపించి, వాటిని ఎలా నిర్మూలించాలో తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సంపూర్ణ, ఏఎన్‌ఎం బుజ్జమ్మ, ఆశా కార్యకర్తలు సుబ్బమ్మ, నాగేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు శిరీష, ఇందుప్రియ, లిఖిత్ కుమార్ పాల్గొన్నారు.

బిందు సేద్య పరికరాలపై అవగాహన


బిందు సేద్య పరికరాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సతీష్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): బిందు సేద్య పరికరాల వలన కలిగే ఉపయోగాలపై బుధవారం మండలంలోని కృష్ణాపురంలో జిల్లా సూక్ష్మ సేద్య అధికారి జి.సతీష్ రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 5 ఎకరాల లోపు పొలం ఉన్న రైతులకు డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీ, స్ప్రింక్లర్లు 55 శాతం రాయితీ, 5 ఎకరాల పైబడిన రైతులకు డ్రిప్ పరికరాలు 70 శాతం రాయితీ, స్ప్రింక్లర్లపై 45 శాతం రాయితీతో ఇస్తున్నామని తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూక్ష్మ సేద్య ఇంజినీర్ కె.వెంకటేష్, సిగ్నెట్ కంపెనీ జిల్లా కో–ఆర్డినేటర్ డి.నరేంద్ర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభ



జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

శ్రీకాళహస్తి: నృత్య ప్రదర్శనలో శ్రీకాళహస్తి విద్యార్థులు ప్రతిభ చాటారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కళానిలయం వేదికగా ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జాతీయ స్థాయి 38వ నవరస శాస్త్రీయ కూచిపూడి, జానపద నృత్యపోటీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన నాట్యాచార్యులు లావణ్య శిష్య బృందం ఆశ్రిత, శ్రీనిధి, శ్రావణి, మన్విత, షణ్ముఖలీలా, హావ్యశ్రీ ఈ పోటీల్లో పాల్గొన్నారు. కూచిపూడి సీనియర్ విభాగంలో శ్రీనిధి మొదటి స్థానం దక్కించుకుంది. వీరంతా నిర్వాహకుల నుంచి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

యూరియా పంపిణీ


రైతులకు యూరియా అందజేస్తున్న గురవారెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో బుధవారం సర్పంచ్ మంజుల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం 10 టన్నుల యూరియా మండలానికి సరఫరా చేసింది. యూరియా ఒక బస్తా రూ.266.50 లకు విక్రయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు, పేకాట ఆడితే చర్యలు


బుచ్చినాయుడుకండ్రిగలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ మంజునాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: సంక్రాంతి పురస్కరించుకుని మండలంలో కోడిపందేలు, పేకాట ఆడినా, నిర్వహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మంజునాథరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని కనమనంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, పూసలపల్లె, చిన్నయిగుంట, ఆర్.అనంతాపురం, జీఎన్‌కండ్రిగ, పార్లపల్లె, పల్లమాల, ఆలత్తూరు, నెలవాయి, కంచనపుత్తూరు గ్రామాల్లో పర్యటించారు. కోడిపందాలు, పేకాట ఆడి పట్టుబడితే చట్టప్రకారం తీసుకునే చర్యలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


సురేష్‌కుమార్

నారాయణవనం పోలీస్ సర్కిల్‌లో..

నారాయణవనం: పుత్తూరు రూరల్ సర్కిల్ పరిధిలో జూదం, పేకాట, కోడిపందేలు, జల్లికట్టును నిషేధించినట్లు పుత్తూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన సర్కిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తమ సర్కిల్‌లోని నారాయణవనం, కేవీబీ పురం, పిచ్చాటూరు, వడమాలపేట మండలాలలో సంక్రాంతి పండుగలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. క్రీడల పోటీలను నిర్వహించే వారు ముందుగా పోలీసుల నుంచి అనుమతి పొందాలన్నారు. ఎక్కడైనా కోడి పందేలను నిర్వహిస్తే పోలీసులను సమాచారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు


త్యాగరాజస్వామి చిత్రపటానికి చేస్తున్న పూజలు

శ్రీకాళహస్తి: పట్టణంలో పొన్నాలమ్మ ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో బుధవారం సద్గురు శ్రీత్యాగరాజస్వామి తృతీయ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి పూజలు చేశారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. పది గంటలకు నాదస్వర విద్వాన్ బీకే.శివనారాయణ బృందం, డోలు విద్వాంసుడు మల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాదస్వర కచేరి నిర్వహించారు. పలు త్యాగరాజ కృతులను ఆలపించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు మహేంద్ర, కార్యదర్శి వెంకటముని, కోశాధికారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద ఓ వ్యక్తి మృతికి సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం తెలిపారు. సీఐ కథనం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లా, భబుక్ గ్రామానికి చెందిన దేబ్రాజ్ ముర్ము(26) భవన నిర్మాణ కార్మికుడిగా ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అతడు ఈ నెల 8న మేర్లపాక సమీపంలోని యల్లమ్మ ఆలయం వద్ద స్పృహ కోల్పోయి పడి ఉన్నట్లు సమాచారం అందడంతో అదే రోజు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ప్రాథమిక విచారణ అనంతరం బుధవారం కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు


ద్రాక్షాయణి(ఫైల్)

ఏర్పేడు: మహిళ అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. బుధవారం ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు... వైఎస్సార్ కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కోడూరు శ్రీనివాసులు కుమార్తె కోడూరు ద్రాక్షాయణి(22) మండలంలోని వికృతమాల టీసీఎల్ కర్మాగారంలో నాణ్యత పరిశీలకురాలిగా పనిచేస్తోంది. ఈ నెల 8న కర్మాగారం నుంచి స్వగ్రామానికి వెళుతున్నట్లు తమ స్నేహితురాలికి ప్రీతికి చెప్పి వెళ్లింది. ఇప్పటి వరకు ఇంటికి చేరకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9440900729 ఫోన్ నంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

పల్లి వీధిలో రోడ్డు వేశారు


పల్లి వీధిలో చేస్తున్న రోడ్డు పనులు

ఏర్పేడు: స్థానిక పల్లి వీధిలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య బుధవారం రోడ్డు వేయించారు. 20 ఏళ్లుగా ఈ వీధిలో 40 కుటుంబాలకు సరైన రోడ్డు సౌకర్యంలేక గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. గ్రామస్తులు వినతిపై సర్పంచ్ స్పందించారు. గ్రామ సభలో దీనిపై వార్డు సభ్యులు తీర్మానించారు. బుధవారం 110 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో రోడ్డు వేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.